
బాన్సువాడలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నస్రుల్లాబాద్‌లో ..


బిచ్కుందలో..

కాళేశ్వరంపై కాంగ్రెస్ నేతల కుట్ర

సాక్షి నెట్‌వర్క్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని ఆరోపిస్తూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ నదీ జలాలను పక్క రాష్ట్రాలకు తరలించి కాళేశ్వరాన్ని ఎండబెట్టే ప్రయత్నంలో భాగంగానే ఇది జరుగుతోందని, సీబీఐకి కాళేశ్వరం కేసు అప్పజెప్పడం అంటే పూర్తిగా ప్రాజెక్టును మూసేయడమేనని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవకతవకలు జరిగాయని విచారణను సీబీఐకి అప్పగించి బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దేనికైనా సిద్ధం.. భయపడేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.


ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ నాయకుల ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్


పెద్దకొడప్‌గల్ గాంధీ చౌరస్తాలో ..


మహమ్మద్‌నగర్‌లో..


జుక్కల్‌లో..


బీబీపేటలో..


మాచారెడ్డిలో..


భిక్కనూరులో ఖాళీ యూరియా బస్తాలతో ఆందోళన


రామారెడ్డిలో..


దోమకొండలో..

ప్రతి కార్యకర్త నాకు ముఖ్యమే

● మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్


మాట్లాడుతున్న జాజాల సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బీఆర్ఎస్‌లో ప్రస్తుతం నిఖార్సయిన కార్యకర్తలు పని చేస్తున్నారని, వారే నాకు ముఖ్యమని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికే టికెట్లు ఇచ్చి గెలిపించుకొని వారినే నాయకులుగా తయారు చేస్తానని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. గోపాలోపేటలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం పార్టీ కార్యకర్తలతో ఆయన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు ఆపదొస్తే ముందుగా స్పందించేది బీఆర్ఎస్ కార్యకర్తలేనని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రూపులన్నింటినీ పక్కనబెట్టి సమష్టిగా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ అంటే 4 కోట్ల మంది ఇంటి పార్టీ అని, 60 లక్షల మంది సైనికులు కలిగిన బీఆర్ఎస్‌లో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారనే కారణంతో సొంత కూతురును సైతం పార్టీ నుంచి సస్పెండ్ చేసిన ఘనత మన నేత కేసీఆర్‌దని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, ఎకరాకు రూ.లక్ష చొప్పున రైతులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఎవరైనా సమస్యలపై ప్రశ్నిస్తే పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేదిలేదని వ్యాఖ్యానించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్, ఎల్లారెడ్డి ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిద్ధయ్య, మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ నర్సింలు, మాజీ జెడ్పీటీసీలు మనోహర్‌రెడ్డి, రాజేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం పేరుతో కేసీఆర్‌పై దుష్ప్రచారం

● మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే


మద్నూర్‌లో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింధే

మద్నూర్(జుక్కల్): మాజీ సీఎం కేసీఆర్‌ను ఏదో విధంగా బద్నాం చేయాలని.. సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం కొట్టుకుపోయింది.. కుంగిపోయింది.. కూలిపోయిందని దుష్ప్రచారం చేస్తున్నారని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే విమర్శించారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకో, నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పజెప్పడం వెనుక కుట్ర ఉందన్నారు. అక్టోబర్ 21, 2023 రోజున కాళేశ్వరం పిల్లర్ల దగ్గర పెద్ద పేలుళ్ల శబ్దం వినిపించిందని, దీంతో ఏడో బ్లాకు కుంగిపోయిందని.. దీని వెనుక ఏదో కుట్ర ఉందని ఆరోపించారు. పార్టీ అధ్యక్షుడు బస్సీ పటేల్, నాయకులు విజయ్, సురేష్, కంచిన్ హన్మండ్లు, నాగేశ్, రాజు తదితరులున్నారు.

వరద మిగిల్చిన విధ్వంసం


కామారెడ్డిటౌన్: ఫిల్టర్‌బెడ్ వద్ద ధ్వంసమైన వైకుంఠధామానికి వెళ్లే రోడ్డు


కామారెడ్డిటౌన్: వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన చెరువు కట్టకు వెళ్లే బ్రిడ్జి


గాంధారి: పోతంగల్ కలాన్-కర్ణం గడ్డ తండా మార్గంలో ధ్వంసమైన కల్వర్టు


మాతుసంగెం-రాంలక్ష్మణ్‌పల్లి మార్గంలో మాతు సంగెం వాగు వంతెన వద్ద కొట్టుకుపోయిన రోడ్డు


కంకర తేలిన ధర్మారావుపేట బీటీ రోడ్డు


కొట్టుకుపోయిన సర్వ పాత చెరువు పంట కాలువ

సాక్షి నెట్‌వర్క్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు జిల్లా కేంద్రంతో పలు మండలాలు, గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా చెరువులు, కుంటల కట్టలు తెగడంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. వర్షాలు, వరదలు ఆగినా మరమ్మతులు ఇంకా ఊపందుకోలేదు. గుంతలు పడ్డ రోడ్లపైనే ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.


దెబ్బతిన్న గుజ్జుల వాగు లోలెవెల్ వంతెన


కోతకు గురైన తిర్మన్‌పల్లి-సదాశివనగర్ రోడ్డు


సదాశివనగర్: రాళ్లు తేలిన అమర్లబండ వాగు రోడ్డు

ఏ వీధి చూసినా చెత్తకుప్పలే..!


రైల్వే స్టేషన్ వివేకానంద కాలనీ ముఖద్వారం వద్ద పేరుకుపోయిన చెత్త


సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనం వద్ద..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణంలో ఏ వీధి, వాడ, మూల మలుపు చూసినా రోడ్ల వెంట చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. వారం రోజులుగా ఆయా వార్డులకు చెత్త బండ్లు రాకపోవడంతో చాలా మంది చెత్తను బహిరంగంగా పడేస్తున్నారు. మున్సిపల్ సానిటేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని బహిరంగంగా పడేసిన చెత్తను తరలించకుంటే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. గణేశ్ నిమజ్జనం దృష్టిలో పెట్టుకుని వెంటనే వీధుల్లోని చెత్తను తరలించాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

డీజే ఆపరేటర్లపై కేసులు నమోదు చేస్తాం


గాంధారి పోలీస్‌స్టేషన్‌లో డీజే నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎస్సై ఆంజనేయులు

బిచ్కుంద/తాడ్వాయి/గాంధారి/భిక్కనూరు: గణపతి ఉత్సవాలలో డీజే సౌండ్ సిస్టమ్ వాడొద్దని, సుప్రీం కోర్టు ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు సూచించారు. అద్దెకు డీజేలు ఇస్తే.. యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మంగళవారం గాంధారిలో ఎస్సై అంజనేయులు, బిచ్కుందలో ఎస్సై మోహన్ రెడ్డి, తాడ్వాయిలో ఎస్సై మురళి, భిక్కనూరులో ఎస్సై ఆంజనేయులు, పెద్దకొడప్‌గల్‌లో ఎస్సై అరుణ్‌కుమార్.. డీజే నిర్వాహకులతో గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. భజన కార్యక్రమాలు, డప్పు వాయిద్యాలు, బ్యాండ్లతో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలుగజేయకుండా శోభాయాత్ర చేపట్టాలని సూచించారు.

పంట నష్టం వివరాల సేకరణ

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/మద్నూర్/గాంధారి/సదాశివనగర్ : జిల్లాలో వరదలు, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పంట నష్టం వివరాలు సేకరించారు. పంట నష్టం నివేదికను పై అధికారులకు పంపుతామని ఈ సందర్భంగా అధికారులు రైతులకు తెలియజేశారు.


మాల్తుమ్మెద శివారులో నీట మునిగిన పంటల వివరాలను సేకరిస్తున్న ఏఈవో ప్రశాంత్


సదాశివనగర్‌లో పంటలను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం రాజులు

వినాయక లడ్డూ @45వేలు



భిక్కనూరు : జంగంపల్లిలోని విజయసాయి కెమికల్ ఫ్యాక్టరీలో అయిదు రోజులుగా పూజలు అందుకున్న వినాయక లడ్డూను మంగళవారం వేలం వేశారు. ఈ లడ్డూను ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉద్యోగులు నరేశ్, రమేశ్, లక్ష్మణ్ కలిసి రూ. 45,516 లకు దక్కించుకున్నారు.

ఓటరు తుది జాబితా ప్రదర్శన



భిక్కనూరు/బాన్సువాడ రూరల్/లింగంపేట/ఎల్లారెడ్డి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మంగళవారం అన్ని గ్రామ పంచాయతీల్లో తుది ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. పంచాయతీ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులపై వాటిని అందుబాటులో ఉంచారు. జాబితాలోని తప్పులను సరిదిద్దిన తర్వాత అర్హుల పేర్లతో తుది జాబితా రూపొందించినట్లు బోర్లం జీపీ కార్యదర్శి సాయి కుమార్ తెలిపారు. ఈ జాబితా ప్రకారమే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు మెంబర్, సర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.

హన్మాజీపేట్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్‌లో మంగళవారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. హన్మాజీపేట్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇమ్రాన్ వైద్య సిబ్బందితో కలిసి రోగులను పరీక్షించారు. వారికి కావాల్సిన మందులు ఉచితంగా అందజేశారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. హెచ్ఈవో రవి, సూపర్‌వైజర్ పాప, ఎంపీహెచ్‌పీ హిమబిందు, తిరుమలేష్, తదితరులు ఉన్నారు.

నిమజ్జనం కోసం చెరువు పరిశీలన



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో గణపతి నిమజ్జనం కోసం మంగళవారం అధికారులు చెరువును పరిశీలించారు. 9, 11వ రోజు బిచ్కుందలో నిమజ్జనం కోసం మినీ ట్యాంక్‌బండ్, కమ్మరి చెరువు వద్ద ఏర్పాట్లు కోసం తహసీల్దార్ వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం, ఎస్సై మోహన్‌రెడ్డి చెరువు పరిసరాలు చూసి ఎక్కడి నుంచి చెరువులో దిగి నిమజ్జనం చేయాలో పరిశీలించారు. నిమజ్జనం రోజున భక్తులు చెరువులోనికి వెళ్లవద్దని అధికారులు కోరారు.

క్లుప్తంగా

బస్సులను నడిపించాలని వినతి

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్, పెద్ద మల్లారెడ్డి గ్రామాలకు బస్సులను పునఃప్రారంభించాలని బీఆర్ఎస్ యువజన మండల కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్.. కామారెడ్డి డీఎంను కోరారు. ఈమేరకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కామారెడ్డి నుంచి దోమకొండ, సంగమేశ్వర్, కాచాపూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాల వరకు రోడ్డు బాగుందని వెంటనే బస్సులను పునఃప్రారంభించాలని కోరారు. రూట్‌ను సర్వే చేసి బుధవారం నుంచి బస్సులను ప్రారంభిస్తామని అధికారి హామీ ఇచ్చారని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ఏఐబీఎస్ఎస్ మండల అధ్యక్షుడిగా కేళోత్ జైసింగ్



రాజంపేట: ఆలిండియా బంజార సేవా సంఘ్ మండల యూత్ అధ్యక్షుడిగా కేళోత్ జైసింగ్ నియమితులైనట్లు మండల అధ్యక్షుడు గణేష్ నాయక్ తెలిపారు. మంగళవారం రాజంపేట మండల కేంద్రంలోని స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద మండల యూత్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా నేనావత్ సంతోష్, ప్రధాన కార్యదర్శిగా మోహన్, కోశాధికారిగా రమావత్ మోహన్, గౌరవ అధ్యక్షుడిగా సబావత్ అనిల్, జాయింట్ సెక్రెటరీగా చవాన్ లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా భాస్కర్, గుగ్లోత్ సంతోష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్, నరేందర్, జవహర్‌లాల్, మదన్, మహేష్ ఎన్నికయ్యారు.

ఎస్జీటీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంతోష్



కామారెడ్డి అర్బన్: ఎస్జీటీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అయ్యాల సంతోష్(బోర్లం ప్రాథమిక పాఠశాల) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఎస్‌జీటీ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఇదివరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన పుల్లూరి స్వామికి ప్రమోషన్ రావడంతో ఖాళీ ఏర్పడగా సంతోష్‌ను ఎన్నుకున్నట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి రాములు తెలిపారు. ప్రతినిధులు రమేష్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి



తాడ్వాయి (ఎల్లారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి శివకుమార్ అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. తాజాగా ఉండే కూరగాయలతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. వంట గదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ప్రిన్సిపల్ రాణి, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పులు చేయించుకోవాలి



భిక్కనూరు: గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలని భిక్కనూరు ప్రభుత్వ వైద్యులు యెమిమా సూచించారు. మంగళవారం ఆమె భిక్కనూరు ప్రభుత్వాస్పత్రిలో అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆమె వెంట ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, స్టాఫ్ నర్సు హరిత తదితరులు పాల్గొన్నారు.

తిప్పాపూర్‌ను సందర్శించిన మండల ప్రత్యేకాధికారి

భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామాన్ని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, పింఛన్లు, రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాలను పరిశీలించారు. అలాగే సబ్‌సెంటర్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి ఉన్నారు.

సంక్షిప్తం

గురు మహరాజ్ పల్లకీ ఊరేగింపు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో మంగళవారం గురు మహరాజ్ పల్లకీ ఊరేగింపు సేవా కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం గణేష్ నవరాత్రుల్లో వచ్చే దశమి రోజున ఆర్యవైశ్యుల గురువైన గురు మహరాజ్ పుణ్యతిథి కార్యక్రమం నిర్వహిస్తామని భక్తులు తెలిపారు. స్థానిక గురు మఠంలో భక్తులు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

అకాల వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

కామారెడ్డి అర్బన్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులతో పాటు ఇళ్లు కూలిపోయిన, ఇళ్లలోకి వరద నీరు చేరి సామగ్రి నష్టపోయిన వారికి ప్రభుత్వ పరంగా అంచనా వేసి పరిహారం అందించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా సాప శివరాములు, ఉపాధ్యక్షుడు గుడిసె చిన్న యాదగిరి, అంబేడ్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత

భిక్కనూరు: మండల కేంద్రంలోని సింగిల్‌విండోలో బాధిత రైతు నీల ఇస్తారి కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును మంగళవారం విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య పంపిణీ చేశారు. విండో వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, నర్సింలు, ఉప్పరి సాయిలు, మద్దురి నర్సింలు, వెంకటిగౌడ్, సాజీద్, కార్యదర్శి రాజు పంతులు, రవికిరణ్ పాల్గొన్నారు.

బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న పనులు

సాక్షి ఎఫెక్ట్..

బీబీపేట: బీబీపేట పెద్ద చెరువు అలుగు పారి ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి వద్ద రోడ్డు ఇరుపక్కల తెగిపోయి ఆరు రోజులుగా రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో మంగళవారం 'నత్తనడకన మరమ్మతులు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తతో అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించారు. మంగళవారం ఉదయం నుంచే పనులను ప్రారంభించి మొరం పోశారు. ద్విచక్ర వాహనాలతో పాటు, పెద్ద వాహనాలు సైతం వెళ్లడానికి మొరం పోసి చదును చేశారు. రోడ్డుకు ఇరువైపులా తాత్కాలికంగా మొరం పోశారు. తర్వాత బీటీ, కంకర పనులు చేస్తారని పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని గోసంగి సంఘంలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం తెలిపారు. గోసంగి సంఘంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.8100 నగదు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలో వినాయక మండపంలో విగ్రహం వెనక భాగంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి రూ. 4,800, రెండు బైక్‌లు, నాలుగు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.